నాణ్యత ముఖ్యం



గుట్టపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు–నేడులో భాగంగా జరుగుతున్న పనులను గురువారం ఇన్‌చార్జి ఎంపీడీఓ టి. పార్వతి, పీఆర్ ఏఈ అల్లాబక్షు పరిశీలించారు. నాడు నేడు ఫేజ్ 2లో సుమారు రూ. 36 లక్షలు నిధులు కేటాయించారని, వీటితో మూడు అదనపు తరగతి గదులు నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.సాయి జ్యోతి పాల్గొన్నారు. –బొల్లాపల్లి

రెండ్రోజులు ఆధార్ సేవలు

మండలంలోని పేరూరుపాడు గ్రామ సచివాలయంలో రెండు రోజు ఆధార్ నమోదు కేంద్రం నిర్వహణ ఉంటుందని సచివాలయ కార్యదర్శి పాండురంగారావు గురువారం తెలిపారు. ఆధార్ నమోదు, సవరణలు, విద్యార్థులకు ఆధార్ నమోదు ఏర్పాటు తదితర ఆధార్ సేవలను పొందాలని తెలిపారు. ప్రభుత్వం మండలంలో వెల్లటూరు, బొల్లాపల్లి సచివాలయాల్లో నిరంతరం ఆధార్ సేవలు అందిస్తుందని, వెల్లటూరు సచివాలయ ఆధార్ నమోదు కేంద్రం నిర్వాహకులు ప్రత్యేకంగా ఈ గ్రామ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేశామన్నారు. –బొల్లాపల్లి



నిబంధనలు తప్పనిసరి



ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టీవీ నాగలక్ష్మి చెప్పారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహన డ్రైవర్లతో పాటు, వికాస్ స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా భద్రతా సూచనలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యా సంస్థల వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకున్నా, 60 సంవత్సరాలు దాటిన వారు ఆ బస్సులలో డ్రైవింగ్ చేసినా జరిమానా విధించటం జరుగుతుందన్నారు. –చిలకలూరిపేట

భూసర్వే వేగవంతం చేయండి

మండలంలోని దాసరిపాలెం, రొంపిచర్ల గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వే కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఆర్డీవో డి.వసంతరావు గురువారం పరిశీలించారు. త్వరితంగా సర్వే పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. భూ యజమానులు అందరూ భూ కొలతలకు హాజరయ్యే విధంగా గ్రామ సభలు నిర్వహించి చైతన్య పర్చాలని ఆయన రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంకారావు, ఆర్ఐ సుబ్బారావు, మండల సర్వేయరు భాగ్యలక్ష్మి, వీఆర్వోలు పాల్గొన్నారు. –రొంపిచర్ల



క్లుప్తంగా

24 వరకు ఆధార్ క్యాంపులు

నాదెండ్ల: మండలంలోని అన్ని సచివాలయాల్లో ఆధార్ కార్డుల అప్‌డేట్ స్పెషల్ క్యాంప్‌లను గురువారం నుంచి ఈ నెల 24వ తేది వరకూ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ తెలిపారు. తొలిరోజు నాదెండ్ల 1,2 సచివాలయాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ నిర్వహించారు. 20వ తేదీ ఉదయం 9.30–12.30 గంటల వరకూ చిరుమామిళ్ల, మధ్యాహ్నం 2–5.30 గంటల వరకూ సంకురాత్రిపాడు, జంగాపల్లె, 21వ తేదీ ఉదయం బుక్కాపురం, చందవరం, మధ్యాహ్నం గొరిజవోలు, 23న ఉదయం సాతులూరు, కనపర్రు, మధ్యాహ్నం తూబాడు, కనపర్రు, 24న ఉదయం ఇర్లపాడు, అప్పాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం, మధ్యాహ్నం గణపవరం గ్రామాల్లోని సచివాలయాల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌ను నాదెండ్ల 1 సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ అజయ్‌దీపక్ పర్యవేక్షించనున్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమయ్యేలా ఉపాధ్యాయులు ఐక్యంగా తమ వంతు కృషి చేయాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. నాడు–నేడు ఎంపికైన పాఠశాలల్లో జరిగిన పనులు, జరగాల్సిన పనుల పురోగతిపై ఎంపీపీ ఆరా తీశారు. సదస్సులో ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, ఎంపీడీవో సీతారామయ్యలు ఉన్నారు.

ఘనంగా ప్రతాప్‌సింగ్ వర్ధంతి

నరసరావుపేట ఈస్ట్: మేవార్ మహారాజు రాణా ప్రతాప్‌సింగ్ 427వ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణ బొందిలి సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ కె.ఎస్.దయానిధి, సివిల్ సర్జన్ డాక్టర్ మంత్రూనాయక్, బి.సి వెల్ఫేర్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దేవళ్ల వెంకటేశ్వరరావు, ఏపీ బొందిలి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొందిలి శ్రీనివాససింగ్, పట్టణ గౌరవాధ్యక్షుడు క్షత్రి శివసింగ్, కార్యదర్శి బొందిలి కృష్ణసింగ్ పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



నాదెండ్ల: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఈ ఏడాది పల్నాడు జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటప్పయ్య చెప్పారు. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు.ముందుగా ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 94 మంది మంచి ఫలితాలతో ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పివిఎంపి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు పేట ఎన్‌సీసీ విద్యార్థి

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ కుందుర్తి కిషోర్ న్యూఢిల్లీలో జరగనున్న 74వ గణతంత్ర దినోత్సవ కవాతుకు ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్ఆర్‌కే రాజు గురువారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ తరపున గుంటూరు గ్రూప్ ఎన్‌సీసీ నుంచి తమ విద్యార్థి కిషోర్ ఎంపిక కావటం ఆనందంగా ఉందన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్ కిషోర్‌ను 23 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్‌గౌతం, కళాశాల పాలక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు కె.విజయకుమార్, ఎన్.సుబ్బరాయ గుప్త, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, అభినందించారు.

నవరత్నాల పాలనలో అందరికీ మేలు

- నాడు–నేడుతో అభివృద్ధికి బాటలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 5వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజని

చిలకలూరిపేట: నవరత్నాల పాలనతో ప్రజలందరికీ మేలు జరుగుతోందని వైద్య, ఆరోగ్యశాఖామంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 35వ వార్డులో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికీ ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అందజేస్తున్నదని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వివరించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించటమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు నాడు–నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. జగనన్న కాలనీల ద్వారా ప్రతి ఒక్కరి సొంతింటి కలలు సాకారం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కేతావతు రమణీబాయి, 14వ ఆర్థిక సంఘం సభ్యుడు వడితే కోట్యానాయక్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు తోట రాజేంద్రప్రసాద్, పీక్లానాయక్, నాగులు నాయక్, రంగా నాయక్, విష్ణునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం పన్ను వసూలు చేయాలి

డీఎల్‌పీవో జయకృష్ణ



కార్యదర్శి రవీంద్రకు సూచనలు చేస్తున్న డీఎల్‌పీవో జయకృష్ణ

శావల్యాపురం: గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూలు నూరుశాతం అయ్యేలా క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని నరసరావుపేట డివిజన్ డీఎల్‌పీవో చావా జయకృష్ణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటి పన్నులు వసూలపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా డీఎల్‌పీవో జయకృష్ణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు సహకారంతో వలంటీర్ల ద్వారా ఇంటి పన్నులు వసూలు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో రూ.25 కోట్లు బకాయి ఉందని అందులో శావల్యాపురం మండలంలో రూ.39 లక్షల ఉండగా, జిల్లాలో 28 మండలాలు ఉండగా 27వ స్థానంలో శావల్యాపురం మండలం ఉందన్నారు. ఇంటి పన్నులు వసూలు నూరుశాతం అయ్యేలా పంచాయతీ కార్యదర్శులు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈనెల 25లోగా 40 శాతం వసూలు చేయాలన్నారు. ఇంటి పన్ను వసూలు చేయటంలో విస్తృతస్థాయిలో గ్రామాల్లో దండోరా, మైకుల ద్వారా ప్రచారం నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంపొందించటంతో పాటు చెల్లింపులు వలన కలుగు ప్రయోజనాలు ప్రజలకు వివరించాలన్నారు.

అభివృద్ధి పనులకు జెడ్పీ నిధులు

- జెడ్పీచైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టీనా
- యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయ సందర్శన



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టీనా

యడ్లపాడు: మండల అభివృద్ధి పనులకు జెడ్పీ నిధులు అందిస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీక్రిస్టీనా చెప్పారు. యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పిడతల ఝాన్సీ సాదరంగా స్వాగతించారు. ఎంపీపీతో పాటు ఎంపీడీవో వై.హనుమారెడ్డి ఇతర శాఖల అధికారుల నుంచి మండల అభివృద్ధి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా అభివృద్ధి పనులు ఏమేమీ ఉన్నాయో గుర్తించి వాటి ప్రణాళికలు నిధుల అంచనాలను పంపించాలని సూచించారు. జెడ్పీ హైస్కూళ్లలో నైట్ వాచ్‌మెన్‌ల పోస్టులను మంజూరు చేయాలని ఎంపీపీ ఝాన్సీ, ఎంపీటీసీ సభ్యుడు కీర్తి అరుణ్‌కుమార్‌లు చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. ఇందుకు ఆమె సమాధానం ఇస్తూ త్వరలోనే ప్రభుత్వం ప్రభుత్వ హైస్కూళ్లలో నైట్ వాచ్‌మెన్ పోస్టులను మంజూరు చేసే దిశగా ఆలోచన చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.వరూధిని, సర్పంచ్ వేణుగోపాలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అంకమ్మరావు, కొప్పుల శామ్యేల్‌పాల్, పందుల బుల్లిబ్బాయ్, కర్నాట సుబ్బారావు ఉన్నారు.

విపత్తుల సమయంలో వలంటీర్లది కీలకపాత్ర

జెడ్పీ సీఈవో డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: విపత్కర పరిస్థితుల్లో ప్రాణ,ఆస్తి నష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వ సిబ్బందిపై ఉందని జెడ్పీ సీఈవో డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆపదమిత్ర పథకంపై కోటప్పకొండ డీఆర్‌డీఏ శిక్షణా కేంద్రంలో జిల్లాలోని నదీ పరీవాహక ప్రాంతం మండలాల్లోని ఎంపిక చేసిన వలంటీర్లు, ఆశ వర్కర్లులకు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 12 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో కమ్యూనిటీ వలంటీర్లు హాజరుకానున్నారు. కార్యక్రమానికి జెడ్పీ సీఈవో శ్రీనివాసరెడ్డి, డీపీవో విజయభాస్కరరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విపత్తుల సమయంలో గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. విపత్తులపై సమాచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు అందిస్తూ వారిని పునరావాస కేంద్రాలకు తరలించాల్సి ఉంటుందన్నారు. దీంతో పాటు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ప్రజలను చైతన్యపర్చాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, డీపీఆర్‌సీ డీఈ శ్రీనివాస పద్మాకర్, ఈవోపీఆర్‌డీ విజయకుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్, దాసు, పంచాయతీ కార్యదర్శులు కె.వి.ప్రసాద్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

24న జిల్లా కరాటే జట్ల ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన సత్తెనపల్లిలోని ప్రగతి హైస్కూల్‌లో బాలబాలికల అండర్–14, అండర్–17 ఉమ్మడి గుంటూరు జిల్లా కరాటే జట్లు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్టు ఫెడరేషన్ కార్యదర్శి సి.హెచ్.కోటేశ్వరరావు గురువారం తెలిపారు. అండర్–14 విభాగం క్రీడాకారులు జనవరి 1వ తేదీ 2009, అండర్–17 క్రీడాకారులు జనవరి 1వతేదీ 2006 సంవత్సరంలోపు జన్మించి ఉండాలని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 24వ తేదీ ఉదయం 8 గంటలకు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

సాతులూరు ఎస్జీటీకు పదోన్నతి

నాదెండ్ల: సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఏజీఎల్ శారద పదోన్నతి పొందారు. ఈమె ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా తిమ్మాపురం ప్రభుత్వ పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని హెచ్ఎం పీవీఎంపీ ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రాథమిక వైద్య సేవలపై అవగాహన

శావల్యాపురం: స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బందికి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం అత్యవసర ప్రాథమిక చికిత్స చేయాల్సిన విధివిధానాలు గురించి వివరించారు. త్వరలో గ్రామసచివాలయాల్లోని ఎంఎల్‌హెచ్‌పీలు ద్వారా ప్రజలకు అవగాహన కలుగ చేస్తారన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి



నాదెండ్ల: తూబాడు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు పెంటారెడ్డి మర్రెడ్డి (80) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య, మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి తదితర నాయకులకు సమకాలీకుడిగా పని చేశారు. ఆయనకు ఓ కుమారుడు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న మంత్రి విడదల రజిని గ్రామానికి చేరుకుని మర్రెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆమెతో పాటూ మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, సర్పంచ్ గోళ్లమూడి కాశయ్య, ఎంపీపీ తలతోటి రాణి, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, నాయకులు సుందరరెడ్డి, దామస్‌రెడ్డి, మత్తేష్‌రెడ్డి, చిన్నపరెడ్డి, జార్జిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొప్పూడి గ్రామానికి చెందిన పూసల వెంకటేశ్వర్లు (58) వ్యక్తిగత పనిమీద స్కూటీపై పట్టణానికి వచ్చి, తిరుగు ప్రయాణమయ్యాడు. జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వెళుతున్న సమయంలో ఓ ప్రైవేటు ఆసుపత్రి సమీపంలో ఎదు రుగా వచ్చిన పల్సర్ వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందగా, పల్సర్ వ్యక్తికి గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- గడపగడపకూ మనప్రభుత్వం లక్ష్యమదే



గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో పథకాలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా

ఈపూరు: ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అందేవిధంగా చూసేందుకే గడపగడకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఈపూరు మండలం బొడిశంబునిపాలెం, బోడేపూడివారి పాలెం గ్రామాలల్లో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందజేశారు. అనంతరం గ్రామస్తులనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలు ఇప్పట్లో లేకపోయినా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకునేందుకు ఇంటింటికీ తిరుగుతున్నట్లు చెప్పారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వెంటనే వారికి కూడా పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశారని గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో కేవలం 39 లక్షల మందికి మాత్రమే పింఛన్లు ఇచ్చారని తమప్రభుత్వ హయాంలో 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బడుగు బలహీన వర్గాల పిల్లల చదువులు ఆర్థిక సమస్యలవల్ల ఆగిపోకుండా ఉండేందుకు ప్రభుత్వం అమ్మఒడి, విద్యాదీవెన, ఫీజ్ రియంబర్స్‌మెంట్, జగనన్న వసతి దీవెన వంటి పథకాలతో పేదల చదువుకోసం కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.

అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో పేదలకు కూడా ఇంగ్లిషు మీడియం అందుబాటులోకి తెచ్చి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేశామన్నారు. నాడు–నేడు పథకం క్రింద పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ప్రతిపక్ష టీడీపీ నాయకులు మాత్రం కళ్లుండికూడా చూడలేని గుడ్డివాళ్లలా తయారయ్యారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పదేళ్ల ఎమ్మెల్యేగా ఉండి కూడా వినుకొండ నియోజకవర్గానికి చెప్పుకోదగ్గ పని ఒక్క పని చేయలేకపోయారని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కోపెలదేవరాజ్, జెడ్పీటీసీ తుర్లపాటి చౌదయ్య, ఎంపీటీసీ గోవర్ధన్, గ్రామ సర్పంచ్ బోడేపూడి శ్రీనివాసరావు, శాఖమూరిబుచ్చయ్య, గోనుగంట్ల వెంకటహనుమయ్య, నర్సారెడ్డి, బోడేపూడి రాజా, ఎంపిడివో ఉషాకిరణ్, తహసీల్దార్ విజయ జ్యోతి కుమారి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా యోగివేమన జయంతి



వేమన చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న హాస్టల్ ప్రతినిధులు, విద్యార్థులు



వినుకొండలో వేడుకలు నిర్వ హిస్తున్న నియోజక వర్గ యోగి వేమారెడ్డి సేవా సమితి నాయకులు

నరసరావుపేట రూరల్: వినుకొండ రోడ్డులోని శ్రీ యోగివేమారెడ్డి బాలుర వసతి గృహంలో యోగి వేమన జయంతి వేడుకలు గురువారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమములో వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈసారి యోగి వేమన జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో మరింత ప్రాచుర్యం సంతరించుకుందన్నారు. ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు అనే పద్యం వినని వారు వానకి తడవని వారు ఉండరని నేటి సమాజంలో నానుడి అన్నారు. కార్యక్రమంలో హాస్టల్ కార్యదర్శి పాలిమేర వెంకటరెడి , కోశాధికారి కాపులపల్లి ఆదిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి కొమ్మసాని కమలాకరరెడ్డి, వెండి బంగారు డైమండ్ నగల వర్తక సంఘం అధ్యక్షులు గౌడవర్తి చంద్రశేఖర్, కోశాధికారి దేసు రజనికుమార్, సహాయ కార్యదర్శి దుగ్గెంపూడి కరుణాకర రెడ్డి, దుగ్గెంపూడి వెంకటరెడ్డి, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో..

రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో యోగి వేమన జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా హైవే రోడ్డు కూడలిలో ఉన్న వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గోపు వెంకటేశ్వరరెడ్డి, మానుకొండ రాఘవరెడ్డి, జక్కిరెడ్డి సంజీవరెడ్డి, గోపు గోపిరెడ్డి, నాగిరెడ్డి, వెంకటరెడ్డి, జక్కిరెడ్డి కాశిరెడ్డి పాల్గొన్నారు.

నాదెండ్లలో....

నాదెండ్ల: పామరులకు సైతం అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి ప్రజల్లో మూఢనమ్మకాల వ్యతిరేకత, హేతుబద్ధ ఆలోచనలు రేకెత్తించిన పద్యకవి యోగి వేమన అని హెచ్ఎం ఎ.గురులింగం చెప్పారు. గణపవరం రాజీవ్‌గాంధీకాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలతో జనవిజ్ఞాన వేదిక, అవనిగడ్డ యల్లమందయ్య–హుస్సేనమ్మ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో యోగి వేమన జయంతిని నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు వేమన పద్య పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. పద్య పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఝాన్సీ లక్ష్మీ, మేరిసుజాత, శివకుమారి, జెవీవీ జిల్లా అధ్యక్షుడు దార్ల బుచ్చిబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ షేక్ బాషా, వలంటీర్ మాణిక్యమ్మ ఉన్నారు.

వినుకొండలో...

వినుకొండ టౌన్: విశ్వకవి యోగి వేమన జయంతిని ప్రతి సంవత్సరం జనవరి 19న అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడమేకాకుండాఅధికారికంగా నిర్వహించడం హర్షణీయమని వినుకొండ నియోజక వర్గ యోగి వేమారెడ్డి సేవా సమితి సెక్రటరీ పి. సుధాకర్ రెడ్డి పెర్కొన్నారు. యోగి వేమన జయంతి సందర్భంగా పట్టణంలోని నియోజక వర్గ యోగి వేమారెడ్డి సేవా సమితి కార్యాలయంలో గురువారం వేడుకలను సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన జిల్లాలలో ఒక జిల్లాకు యోగి వేమన పేరును పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి ఉపాధ్యక్షులు చల్లా రవీంద్రనాథ్ రెడ్డి, కోశాధికారి యారం రామిరెడ్డి, గౌరవ సలహాదారులు న్యాయవాది కర్నాటి చెన్నకేశవ రెడ్డి, మాజీ అధ్యక్షులు మూలే బాల చెన్నారెడ్డి, గీతమ్స్ విద్యా సంస్థల డైరక్టర్ మాలపాటి కోటిరెడ్డి, మాజీ సర్పంచ్ కొత్త కృష్ణారెడ్డి, న్యాయ సలహాదారులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో గ్రామీణ మహిళ ప్రతిభ



వినుకొండ (నూజెండ్ల): అవకాశాలు కల్పిస్తే ప్రతిభకు కొదవ లేదని గ్రామీణ మహిళ నిరూపించింది. ఇటీవల సంక్రాంతి పర్వదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. అందులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేటలో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహించింది, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలల్లో నూజెండ్ల మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళ నాగండ్ల గోవిందమ్మ తన ప్రతిభను కనపరచి జిల్లా స్థాయిలో కన్సోలేషన్ బహుమతి అందుకుంది. జిల్లావ్యాప్తంగా వందలాది మంది మహిళలు పాల్గొన్న ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన ఆమెను జిల్లా ఉన్నతాధికారులు నగదు బహుమతి, షీల్డుతోపాటు శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రామీణ ప్రాంతాలల్లో కూడా ప్రతిభకు కొరవ లేదని నిరూపించింది. ప్రభుత్వం ప్రోత్సాహం వల్లే తనకు గర్తింపు వచ్చిందని ఆమె తెలిపింది.